



వొంకర తిరుగుతుంది. స్థలం, లుంగలు చుట్టుకున్న పాముకిమల్లే వంకర తిరుగుతుంది. ఇక్కడనుంచి బైలుదేరితే, విశ్వంఅంతా చుట్టి ఎప్పటికైనా యిక్కడికే చేరుకుంటాం. అనుభవించే వ్యక్తిని బట్టి సత్యంయొక్క స్వరూపం మారుతూంటుంది. ఈ రిషావాడి అనుభవం యిది. ఇందులోని స్వారస్యం ఐన్‌స్టయిన్‌వంటి శాస్త్రజ్ఞుల కర్థమవుతుంది.

జనంలో కొందరు వాడుచెప్పింది రైటన్నారు. పగసాధించడం వాడి వుద్దేశమైతే, రిషాచక్రం వూడకొట్టుకుంటాడా ? లైటు బ్రద్దలుకొట్టుకుంటాడా, గంటలా మోగించే మువ్వలు పోగొట్టుకుంటాడా ? అని అడిగారు.

పోలీసుకు, దవాలీ బంట్రోతుకు నమ్మకం కుదరలేదు.

"రిషా ఎవరిది ?" అని ఎవరో అడిగారు.

"వాడిదేట —సొంతంట" అన్నారు

రిషాకి లైసెన్సు ఏది ? లేదు, పోలీసుకు ధైర్యం చిక్కింది. వూడినచక్రం రిషాకి బిగించమన్నారు. వాడు బిగించాడు. ఫ్యాక్టరీ యజమాని బంగళాకి నడవమన్నారు. జనం పల్చబడ్డారు. మెల్లిగాజారుకున్నారు. దవాలి బంట్రోతూ పోలీసూ ముందు, వెనక నేనూ, మధ్య వూగిసలాడుతూ రిషా బంగళాకేసి బైలుదేరాం.

రిషా కొని లాభంచెయ్యాలన్న నా సంకల్పం సన్నగిల్లింది. లైసెన్సు యిందాక అంచనా వెయ్యలేదు. దానికి దీపం, గంట, రిపేర్లు చాలా తంతు వుంది. నడిపేవాడికి జబ్బు చేస్తే, మందు

